17-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి ''బాప్ దాదా'' మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు నోటితో ఏమీ మాట్లాడవలసిన అవసరం లేదు, సత్యమైన హృదయముతో ఒక్క తండ్రిని నిరంతరము స్మృతి చేయాలి, సత్యమైన హృదయముపైనే తండ్రి రాజీ అవుతారు"

ప్రశ్న:- అన్నింటికన్నా మంచి మ్యానర్ (చరిత్ర) ఏది? ఏ దైవీ మ్యానర్స్ ను మీరు ధారణ చేయాలి?

జవాబు:- సదా హర్షితముగా ఉండడం చాలా మంచి మ్యానర్. దేవతలు సదా హర్షితముగా ఉంటారు, వారు గట్టి-గట్టిగా నవ్వరు. శబ్దము చేస్తూ నవ్వడము కూడా ఒక వికారమే. పిల్లలైన మీకు స్మృతి యొక్క గుప్తమైన సంతోషము ఉండాలి. ఫెమీలియారిటీ (అతి చనువు) యొక్క సంస్కారము కూడా చాలా నష్టదాయకమైనది. సేవా సఫలత కొరకు అనాసక్త వృత్తి కావాలి. నామ-రూపాల దుర్గంధము కొద్దిగా కూడా ఉండకూడదు. బుద్ధి చాలా స్వచ్ఛముగా ఉండాలి. ఎప్పుడైతే ఇదే ధారణతో సేవ చేస్తారో, ఇతరులను తమ సమానముగా తయారుచేస్తారో, అప్పుడు ముఖము హర్షితముగా ఉంటుంది.

పాట:- వారు మా నుండి దూరమవ్వరు... (నా వహ్ హమ్సే జుదా హోంగే...)

ఓం శాంతి. పిల్లలకు తెలుసు కానీ నంబరువారు పురుషార్థానుసారంగా తెలుసు ఎందుకంటే సత్యమైన హృదయముపై తండ్రి రాజీ అవుతారు అని అంటారు. హృదయము కూడా ఆత్మలో ఉంది కదా. కావున సత్యమైన తండ్రిని స్మృతి చేసినట్లయితే సుఖం లభిస్తుంది. స్మృతి అనగా లోలోపల తండ్రిని స్మృతి చేయడము. ఆ తండ్రిని జపిస్తూ ఉండండి. జపము అనగా నోటితో ఏదో ఒకటి మాట్లాడుతూ ఉండాలని కాదు. అలా కాదు, స్మృతి చేస్తూ ఉన్నట్లయితే ఎంతో సుఖము లభిస్తుంది. ఇతరులను కూడా తమ సమానంగా తయారుచేయాలి. ఎవరికైనా అర్థం చేయించడం కూడా చాలా సహజము. ఏ విధంగా సత్యమైన పతివ్రతా స్త్రీ తన పతిని తప్ప ఇంకెవ్వరినీ ప్రేమించరో, అలాగే ఆత్మ ఆ అనంతమైన పారలౌకిక తండ్రిని సత్యమైన హృదయంతో స్మృతి చేయాలి. ఏ విధంగా ప్రేయసీ-ప్రియుల ప్రేమ ఉంటుంది, వారు నామ-రూపాలపై బలిహారమవుతూ ఉంటారు, వికారాలకు సంబంధించిన విషయమేమీ ఉండదు. ప్రేయసి ప్రియుడిని, ప్రియుడు ప్రేయసిని తలచుకుంటారు, అంతే, ఇక బుద్ధి ఎక్కడికీ వెళ్ళదు. అయితే వ్యాపార-వ్యవహారాలు కూడా చేస్తారు కానీ మనసు ఒక్కరితోనే ఉంటుంది. అది పవిత్రమైన స్మృతి. శరీరము మరియు బుద్ధి అపవిత్రంగా ఉండవు. దాని గురించి కూడా గాయనం ఉంది, కానీ అటువంటివారు చాలా తక్కువమంది ఉన్నారు. ఈ జ్ఞానములో కూడా సత్యమైన ప్రేయసులు చాలా కొద్దిమంది ఉన్నారు. మాయ ఎటువంటిదంటే అది ముక్కుతో పట్టుకుంటుంది. అంగదుని ఉదాహరణ ఇవ్వడం జరిగింది. ఇతను కదులుతాడా లేదా చూద్దాము - అని రావణుడు అన్నాడు. చురుకుగా ఉండే మహారథులు ఎవరైతే ఉంటారో వారినే మాయ వెంటాడుతుంది. ఏ విధంగా ఎలుక కొరుకుతుంది కదా, అది ఎలా ఊదుతుంది అనేది అసలు తెలియనే తెలియదు. అలాగే మాయ కూడా చాలా శక్తివంతమైనది. ఎవరైతే నియమ విరుద్ధమైన నడవడిక నడుచుకుంటారో, వారికి లోపలి నుండే బుద్ధికి గుప్తంగా తాళం వేస్తుంది. ఇందులో అర్థం చేసుకునేందుకు విశాలమైన బుద్ధి కావాలి. బాబాను స్మృతి చేసే అభ్యాసము చాలా ఉండాలి. తండ్రిపై పూర్తి-పూర్తి ప్రేమ ఉండాలి.

మీరు అనాసక్తులై సేవ చేయాలి. ఎవరు ఎంత మంచి పిల్లలైనా కానీ వారి నామ-రూపాలలో చిక్కుకోకూడదు, దీని వలన చాలా నష్టం కలిగిస్తారు. తండ్రి అంటారు - స్వయాన్ని అశరీరి ఆత్మగా భావిస్తూ నన్ను స్మృతి చేయండి. తమను తాము స్వచ్ఛముగా ఉంచుకోండి. మీరు శివబాబాకు చెందినవారిగా అవుతారు, వారు మిమ్మల్ని స్వచ్ఛముగా తయారుచేస్తారు. వికారాలను తొలగించివేయాలి. మీ పేరే శివశక్తులు. మీకు సర్వశక్తివంతుడి నుండి శక్తి లభిస్తుంది, కావున వారితో మంచి రీతిలో యోగం జోడించవలసి ఉంటుంది. తండ్రి అంటారు - నిరంతరం స్మృతి చేయడము సామాన్యమైన విషయమేమీ కాదు. భోజనం చేసే సమయంలో ఎంతగా ప్రయత్నిస్తారు, అయినా మర్చిపోతారు. పూర్తి సమయం తండ్రి స్మృతిలో తినాలి ఎందుకంటే వారు మనకు ఎంతో ప్రియమైనవారు, మరి మనం వారిని స్మృతి చేస్తూ ఎందుకు తినకూడదు, అలా చేస్తే వారు తోడుగా ఉంటారు అని ఎంతో ప్రయత్నిస్తారు. అయినా ఘడియ-ఘడియ స్మృతిని మర్చిపోతారు. భక్తి మార్గములో కూడా బుద్ధి వేరే వైపులకు భ్రమిస్తూ ఉంటుంది. ఇది జ్ఞానము యొక్క విషయము. ఈ విషయాలను పిల్లలు కూడా పూర్తిగా అర్థం చేసుకోరు. చాలామంది పిల్లలు ఇప్పటికీ ఇంకా అంబాడుతూ ఉంటారు. ఒకవేళ నిరంతరమూ యోగము జోడింపబడి ఉన్నట్లయితే, ఇక కర్మాతీత స్థితి వస్తూ ఉందని

భావించవచ్చు. కానీ స్మృతి నిలవదు, యుద్ధము బాగా జరుగుతూ ఉంటుంది. చాలామంది బుద్ధియోగము భ్రమిస్తూ ఉండటాన్ని బాబా చూస్తారు, అశరీరిగా అవ్వడంలో శ్రమించవలసి ఉంటుంది. సత్యము వినిపించేవారు చాలా కొద్దిమందే ఉంటారు. వినిపించడానికి సిగ్గుగా అనిపిస్తుంది. మాయ చాలా శక్తివంతమైనది. ఒక్కసారిగా తల తిప్పేయడానికి పెద్ద ఆలస్యం చేయదు. మేము పిల్లలమే కదా! అని భావించడం కాదు. యుక్తులు కూడా తెలియజేయడం జరుగుతుంది. మొదట కర్మాతీత అవస్థలోకి వెళ్ళాలి, ఆ తర్వాత పదవి నంబరువారుగా ఉంటుంది. పిల్లలను మాయ బాగా హైరానా పరుస్తుందని, స్మృతిని నిలువనివ్వదని బాబాకు తెలుసు. చాలామంది అవస్థను గమనించడం జరుగుతుంది. నామ-రూపాలలో చిక్కుకుంటారు. స్వయాన్ని అశరీరిగా భావించే అభ్యాసము చేయాలి ఎందుకంటే ఎంతో సమయంగా స్వయాన్ని అశరీరిగా భావించలేదు. సత్యయుగములో - నేను ఒక ఆత్మను, నేను ఈ పాత శరీరాన్ని వదిలి కొత్తదానిని తీసుకోవాలి అన్న జ్ఞానము పూర్తిగా ఉంటుంది. సాక్షాత్కారాలు కూడా జరుగుతాయి. ప్రత్యక్షంగానైనా లేక పరోక్షంగానైనా - ఇప్పుడు శరీర ఆయువు పూర్తి కావస్తుంది అని అర్థమవుతుంది. ఎవరైనా చనిపోయేటప్పుడు - నేను ఇప్పుడిక చనిపోతాను, ఇక ఉండలేనేమో అని నాకు అనిపిస్తోంది అని అంటారు. అలాగే అక్కడ - ఇప్పుడు శరీరము పెద్దది అయ్యింది, దీనిని ఇప్పుడు వదిలేయాలి అని భావిస్తారు. తమ సమయమనుసారముగా సంతోషంగా వదిలేస్తారు. ఆత్మ జ్ఞానము పూర్తిగా ఉంటుంది. తండ్రి జ్ఞానము ఏమాత్రమూ ఉండదు. డ్రామాలో అలా లేదు. అక్కడ తండ్రిని ఎందుకు స్మృతి చేయాలి? అవసరమే లేదు. ఇక్కడైతే దుఃఖములో మనుష్యులు స్మృతి చేస్తారు మరియు మీరేమో స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రితో యోగము జోడించాలి. ఈ శరీరము పురాతనమైనది. దీనిపై పూర్తిగా అయిష్టం కలగాలి. శరీరము ఎంత అందముగా, సుందరముగా ఉన్నా కానీ నియమానుసారంగా అయితే అందరూ నల్లగా ఉన్నారు ఎందుకంటే ఆత్మ నల్లగా ఉంది. ఇది బుద్ధి ద్వారా అర్థం చేసుకోవలసిన విషయము. అలాగని అందరి శరీరాలూ నల్లగా ఉండవు, అది గాలి మరియు నీటిపై ఆధారపడి ఉంటుంది. ఎక్కడైతే చల్లదనం ఎక్కువగా ఉంటుందో అక్కడ తెల్లని మనుష్యులు ఉంటారు. తండ్రి అర్థం చేయిస్తారు - బుద్ధి యోగాన్ని ఒక్కరితోనే జోడించాలి. ఏ విధముగా ప్రేమ వివాహాలు చేసుకుంటారు కదా. అలాగే ఇది కూడా మీ ఆత్మ యొక్క ప్రేమ వివాహము. ఆ తర్వాత ఇక ఈ దేహము పట్ల కూడా ప్రేమ ఉండదు. తమ దేహము పైనే ప్రేమ లేనప్పుడు ఇక ఇతరుల దేహముపై ప్రేమను ఏమి ఉంచాలి. ప్రపంచములోనైతే నలుపు-తెలుపు ముఖాల ఆధారముగా కూడా ఉంటూ ఉంటుంది. కొందరైతే చూడకుండానే నిశ్చితార్థము జరుపుతారు, తర్వాత ఎప్పుడైతే ముఖాన్ని చూస్తారో, అప్పుడు నాకు ఇటువంటి నల్లని వ్యక్తి వద్దు అని అంటారు. అప్పుడిక గొడవ జరుగుతుంది - మేము ధనాన్ని ఏం చేసుకోవాలి, మాకైతే అందమైనవారు కావాలి.

మనం ఒక ఆత్మ అని ఇప్పుడు మీకు తెలుసు. ఈ పాత శరీరముపై మోహాన్ని ఉంచకూడదు. ఇది వికారీ సంబంధము కదా. ప్రాపంచిక విషయాలకు మన విషయాలు అతీతమైనవి. ఇప్పుడు మీ నల్లని ఆత్మ యొక్క నిశ్చితార్థము తెల్లని యాత్రికునితో జరిగింది. ఈ ప్రపంచములో అందరి ఆత్మ ఎంతో నల్లగా ఉందని మీకు తెలుసు. తెల్లనివారితో సంబంధాన్ని జోడించి ఆత్మను తెల్లగా తయారుచేసుకోవాలి. ఒక్క యాత్రికుడు వందలాది-వేలాది మందిని సుందరముగా తయారుచేస్తారు. నల్లని ఆత్మను తెల్లగా తయారుచేయాలి. ఇందులో చాలా మంచి యోగము కావాలి. నల్లగా ఉండిపోతే ఒకటేమో శిక్షలను అనుభవించవలసి ఉంటుంది, అలాగే పదవి కూడా భ్రష్టమైపోతుంది. ఇక్కడ ఎవరి నామ-రూపాలలోనూ వ్రేలాడకూడదు. అప్పుడు ఎంతో డిస్ సర్వీస్ జరుగుతుంది. అందుకే బాబా - జాగ్రత్తగా ఉండండి, మీరు మాయ చక్రములోకి వచ్చేసారు అని అర్థం చేయిస్తారు, అయినా అర్థం చేసుకోరు. ఆ తలరాత విడిచిపెట్టదు. తమ పదవిని భ్రష్టం చేసుకుంటారు. తండ్రి అంటారు - యోగాగ్ని ద్వారా మీ ఆత్మను పవిత్రముగా తయారుచేసుకోవాలి. ఇది భట్టీ. తండ్రితో యోగము జోడించాలి. వేరే వైపులకు బుద్ధి వెళ్తే వ్యభిచారి అయినట్లు. ఇక సేవ చేయలేకపోతారు, పదవిని కూడా పొందలేకపోతారు. యోగాగ్ని ద్వారానే మాలిన్యము తొలగుతుంది. యోగము ఉన్నట్లయితే జ్ఞానము కూడా నిలుస్తుంది.

బాబా రూప్ కూడా, అలాగే బసంత్ కూడా. పిల్లలైన మీరు కూడా ఎంతగా రూప్ వలె (యోగ స్వరూపులుగా) అవుతూ ఉంటారో, అంతగా జ్ఞాన ధారణ జరుగుతూ ఉంటుంది. మొదట ఆత్మను పవిత్రముగా తయారుచేసుకోవాలి. యోగము, యోగము అని అంటూ ఉంటారు కానీ మీలో కూడా చాలామందికి యోగము యొక్క అర్థము తెలియదు. యోగము లేకుండా స్వయాన్ని లేక భారత్ ను పవిత్రముగా తయారుచేయలేరు. సేవ చేస్తున్నా, సెంటర్లు తెరుస్తున్నా కానీ మాయ పూర్తిగా ముక్కు పట్టుకుంటుంది. నేను ఇన్ని సెంటర్లు తెరిచాను అన్న అహంకారం వచ్చేస్తుంది. దేహాభిమానం వచ్చేస్తుంది. తండ్రి అర్థం చేయిస్తారు - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రితో యోగాన్ని జోడించండి. ఏ వికర్మలూ

జరుగకూడదు. ఒకవేళ బాబాను మరచి ఎవరి నామ-రూపాలలోనైనా చిక్కుకున్నట్లయితే ఎంతో నష్టం వాటిల్లుతుంది. ఇది చాలా పెద్ద గమ్యము. విశ్వానికి అధిపతులుగా అవ్వడం ఏమైనా తక్కువ విషయమా! తండ్రికి ఎంత మహిమ ఉంది! వారి పేరు మీద ఎన్ని మందిరాలను తయారుచేస్తారు! సోమనాథ మందిరాన్ని ఎవరు తయారుచేసారు మరియు ఎప్పుడు తయారుచేసారు అనేది మీకు తెలుసు. మందిరాలు కూడా నంబరువారుగా తయారవుతాయి. సోమనాథుని తర్వాత లక్ష్మీ-నారాయణులు మరియు జగదాంబ మందిరాలు ఉన్నాయి. మనుష్యులకు సోమనాథుని మందిరాన్ని ఎవరు తయారుచేసారు అన్నది ఏమైనా తెలుసా? వారు నిరాకారుడు. నిరాకారుని పూజారులు నిరాకార శివుడినే పూజిస్తారు. కానీ వారి గురించి తెలియదు. పిల్లలైన మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. రాత్రింబవళ్ళు సేవ యొక్క చింత (తపన) ఉంటుంది. ఎప్పుడైతే దేహాభిమానము తొలగిపోతుందో, అప్పుడే తపన కూడా పూర్తిగా ఉంటుంది. దేహీ-అభిమానులుగా అవ్వాలి. తండ్రితో పూర్తి యోగము జోడించాలి. వారి పట్ల పూర్తి గౌరవాన్ని ఉంచడం సామాన్యమైన విషయమేమీ కాదు. మాయ భూతాలు యోగాన్ని తెంచివేస్తాయి. ఇది తండ్రికే తెలుసు. ఎంతోమంది చాలా నాజూకుగా ఉంటారు, కాస్త ఏమైనా అంటే వెంటనే డిస్టర్బ్ అయి ద్రోహులుగా అయిపోతారు. అటువంటివారు తమ అదృష్టాన్ని తామే పాడు చేసుకుంటారు. ఆశ్చర్యం కలిగేలా బాబాకు చెందినవారిగా అవుతారు, మళ్ళీ పారిపోతారు, డిస్సర్వీస్ చేయడం మొదలుపెడతారు. అమృతాన్ని త్రాగుతూ, త్రాగుతూ ద్రోహులుగా అయి ఆ తర్వాత ఎంతో విసిగించినట్లుగా భాగవతములో కూడా ఒక కథ ఉంది. ఫలానావారు కచ్చాగా ఉన్నారు అని, ఏ సమయంలోనైనా ద్రోహులుగా అయి నష్టపరచవచ్చు అని తండ్రికి ఎంతో ఆలోచన ఉంటుంది. అలాగే ద్రోహులుగా అయి నష్టపరచడం కూడా చూస్తారు. అప్పుడిక ఎంతోమంది అబలలపై అత్యాచారాలు జరుగుతాయి. ఇతర సత్సంగాలలో అత్యాచారాలు జరుగుతాయా? ఇక్కడ విషాన్ని అనగా వికారాలను వదలడమే మొదటి విషయము. వికారాలను వదలరు.

ఫలానావారు స్వర్గస్థులయ్యారు అని అంటారు కూడా కానీ ఆ స్వర్గము ఏమిటి అనేది ఏమీ తెలియదు. అర్థం తెలియనివారిలా మాట్లాడుతూ ఉంటారు. ఇప్పుడు ఎంత వివేకము లభించింది. ఎవరెవరు మంచి-మంచి పుష్పాలో తండ్రికి తెలుసు. నామ-రూపాలలో చిక్కుకునే దుర్గంధము ఏమాత్రమూ లేనివారు కొందరు ఉన్నారు. జ్ఞానము తప్ప ఇంకే విషయమూ ఉండదు. యోగము కూడా పూర్తిగా ఉండాలి. కొందరు ముందు నుండే నల్లగా ఉంటారు, తర్వాత ఇంకా నల్లగా అయిపోతూ ఉంటారు. ఈ సైన్యములో ఏనుగుల సైన్యమూ ఉంది, అలాగే సింహాల సైన్యమూ ఉంది, గుర్రాల సైన్యమూ ఉంది, అలాగే మేకల సైన్యమూ ఉంది. అందరూ ఉన్నారు. నడవడిక ద్వారా - వీరు గొర్రెలవంటివారు అని వెంటనే తెలిసిపోతుంది. అటువంటివారు ఏమీ అర్థం చేసుకోరు, బుద్ధిలో ఏమీ కూర్చోదు. గేదె బుద్ధి వలె ఉంటుంది. తండ్రి ఎంత సులభం చేసి అర్థం చేయిస్తారు - నీవు ఆత్మవు, మరి నీవు అనంతమైన తండ్రిని స్మృతి చేయలేవా? ఓ ఆత్మా, నీవు ఇతర అన్ని వైపుల నుండి బుద్ధియోగాన్ని తొలగించి నన్ను స్మృతి చేయి. నీవు స్మృతి చేయలేవా? ఇతర మిత్ర-సంబంధీకులు మొదలైనవారిని తలచుకుంటూ ఉంటావు, నన్ను స్మృతి చేయడంలో కష్టమేముంది? బాబా, మాయ బుద్ధియోగాన్ని తెంచివేస్తుంది! అని అంటారు. అరే, వారసత్వాన్ని పోగొట్టుకుంటారు. మీరు బుద్ధియోగాన్ని పూర్తిగా జోడించినట్లయితే విశ్వాధిపతులుగా అవుతారు. తండ్రిని అలా ఎప్పుడైనా మర్చిపోవచ్చా? దేహాభిమానులుగా అవ్వడం వలనే మీరు మర్చిపోతారు. స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రిని నిరంతరమూ స్మృతి చేయండి అని మీకు పదే-పదే చెప్పడం జరుగుతుంది. జపించకండి, శబ్దం చేయకండి. మీరు వాణి నుండి అతీతముగా వెళ్ళాలి. రామ-రామ అని నోటితో అంటే దేహాభిమానము వస్తుంది. లోలోపల స్మరించాలి. ఇంద్రియాలను కేవలం ఆధారంగా తీసుకోవాలి. నేను ఒక ఆత్మను, శాంతిలో ఉంటూ తండ్రిని స్మృతి చేయాలి. బాబా జ్ఞానసాగరుడు, నాలెడ్జ్ ఫుల్. వారిలో మొత్తం జ్ఞానమంతా ఉంది. మీకు కూడా నేర్పిస్తారు. తండ్రిని స్మృతి చేయడం ద్వారా మీరు పవిత్రముగా అవుతారు, పవిత్రమైన కిరీటము లభిస్తుంది మరియు సృష్టి చక్రాన్ని తెలుసుకోవడం ద్వారా రత్న జడితమైన కిరీటము లభిస్తుంది. ద్వికిరీటధారులుగా అవుతారు. స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. లేదంటే ధర్మరాజు ద్వారా దెబ్బలు తినవలసి ఉంటుంది, పదవి కూడా భ్రష్టమైపోతుంది, అందుకే తండ్రిని స్మృతి చేయాలి. అలాగే, గుప్తమైన సంతోషము కూడా ఉండాలి. శబ్దం చేస్తూ నవ్వకూడదు. లక్ష్మీ-నారాయణులను హర్షితముఖులు అని అంటారు. హర్షితముఖులుగా ఉండడం మరియు పెద్దగా నవ్వడం వేరు-వేరు. హర్షితముఖులుగా ఉండడం ద్వారా ఆ గుప్తమైన సంతోషము ఉంటుంది. శబ్దం చేస్తూ నవ్వడం తప్పు. హర్షితముగా ఉండడం అన్నింటికన్నా మంచిది. గట్టి-గట్టిగా నవ్వడం కూడా ఒక వికారమే. అది కూడా ఉండకూడదు. సంతోషము మీ ముఖము పైకి రావాలి. అది ఎప్పుడు వస్తుందంటే తమ సమానముగా తయారుచేసినప్పుడు. సేవ మరియు సేవ. సేవ దొరకగానే పరుగెత్తాలి, ఇంకే విషయమూ ఉండకూడదు. పిల్లలైన మీరు సేవ చేస్తారు, ముళ్ళను మొగ్గలుగా తయారుచేస్తారు. బాబా పిల్లలకు మంచి-మంచి పాయింట్లు తెలియజేస్తారు. బాబాయే వినిపిస్తారు అన్న నిశ్చయము ఉంచాలి. వీరు కూడా అంటారు - నా మహిమ

చేయకండి, మహిమ అంతా శివబాబాదే, వారిని స్మృతి చేయడం ద్వారానే పూర్తి వికర్మాజీతులుగా అవుతారు. ఇది చాలా సహజమైన విషయము. స్మృతి చేయాలి మరియు చక్రాన్ని తిప్పాలి. పూర్తి స్వదర్శన చక్రధారులుగా నంబరువారుగా అవుతారు, అంతిమంలో అవుతారు. అచ్చా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రిని తోడుగా ఉంచుకునే యుక్తిని రచించాలి. భోజనం చేసేటప్పుడు స్మృతిలో ఉండాలి. అశరీరిగా అయ్యే అభ్యాసము చెయ్యాలి. తమ పాత దేహము పట్ల కూడా ప్రేమను ఉంచుకోకూడదు.

2. తండ్రి పట్ల పూర్తి గౌరవాన్ని ఉంచాలి. అహంకారములోకి రాకూడదు. నామ-రూపాల వ్యాధి నుండి సదా దూరముగా ఉండాలి. జ్ఞాన-యోగాలలో నిమగ్నమై ఉండాలి.

వరదానము:- అంతా తండ్రికి అర్పించి సంగమయుగపు రాజ్యాధికారాన్ని అనుభవము చేసే అవినాశీ రాజ్య తిలకపు అధికారీ భవ

ఈ రోజుల్లోని రాజ్యాధికారము ధనాన్ని దానం చేయటం ద్వారా అన్నా లభిస్తుంది లేక ఓట్ల ద్వారా అన్నా లభిస్తుంది, కానీ పిల్లలైన మీకు స్వయంగా తండ్రియే రాజ్య తిలకాన్ని ఇచ్చారు. చింతలేని చక్రవర్తి - ఇది ఎంతటి మంచి స్థితి. ఎప్పుడైతే అంతా తండ్రికి అప్పగించారో, అప్పుడు చింత ఎవరికి ఉంటుంది? తండ్రికి. కానీ కొంచెము-కొంచెము ఎక్కడైనా తమ అథారిటీని లేక మన్మతాన్ని దాచి ఉంచుకోకూడదు. ఒకవేళ శ్రీమతము అనుసారంగా ఉన్నట్లయితే తండ్రికి అర్పణ అయి ఉన్నట్లు. ఇలా సత్యమైన హృదయముతో సర్వస్వాన్ని తండ్రికి అర్పణ చేసేవారు డబుల్ లైట్ గా, అవినాశీ రాజ్య తిలకానికి అధికారులుగా అవుతారు.

స్లోగన్:- ప్రతి వాక్యమూ మహావాక్యముగా ఉండాలి, ఏ మాటా వ్యర్థంగా పోకూడదు, అప్పుడు మాస్టర్ సద్గురువు అని అంటారు.